# కాముడు



ఆనాడు కామేశ్వర్రావు అనే కాముడికి భోగిపండుగలాటి సర్వ్వదినం.

ఎందుకనీ? ....

ఆవేళ అతనికి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చింది కాబట్టి ....

ఏమనీ? ....

అతని భార్య చి॥సౌ॥ కల్యాణి బయల్దేరి (కొత్తగా కాపురానికి) రాబోతూందనీ....

ఎప్పుడూ?

బయల్దేరడం ఆదేరోజు - రావడం మర్నాడుదయం.



అందుకనే ఆరోజు అతనికి భోగి పండుగ - మర్నాడు పెద్దపండుగ - మహా పర్వదినం. అందుకనే ఆఫీసు వదలగానే తన 'ఇల్లు' అనబడే అద్దె గదికి పరిగెత్తుకుని వచ్చేసి, సబ్బుతో తలంటిపోసుకొని, సరికొత్త యిస్త్రీబట్టలు ధరించి, బూట్లు తొడుక్కుని హుషారుగా ఈలవేసుకుంటూ గది తలుపులు మూసి వీధిలో పడదామని ప్రయత్నిస్తుండగా అప్రయత్నంగా యీల కల్యాణి రాగంలోకి దిగిపోవడంవల్ల మరి వెళ్ళడానికి మనస్కొప్పక మేను వాల్చి కల్యాణి నాలపిస్తూ, తటాలున ప్రతి మధ్యమం శుద్ధ మధ్యమం కావడం వల్ల తన మనసు కల్యాణిమీద నిలవడం లేదని గుర్తించినవాడై, నాలుక్కరుచుకోబోయి, పూసివుండటంవల్ల ఆ ప్రయత్నం మానుకుని శాస్త్రికోసారి నెత్తిమీద కొట్టుకుని, కల్యాణిపై మనసు లగ్నమవడం కోసం తన భార్య కల్యాణి స్వహస్తాలతో తనకు రాసిన ప్రణయ లేఖలు చదవడానికి పూనుకున్నాడు.

"ప్రియమైన భర్త గారికి,

తమ భార్య చి॥ సౌ॥ కల్యాణి శతకోటి నమస్కారాలుచేసి వ్రాయున దేమనగా...."

కాముడు తన భార్య అమాయకత్వానికి నవ్వుకున్నాడు. తనకు తానే చి॥ సౌ॥ కల్యాణి అని రాస్తుందేమిటి? తుమ్మి 'చిరంజీవ' అనుకున్నట్టు? స్నానంచేసి తనకు తానే శ్రీరామ రక్ష పెట్టుకున్నట్టు—

"ఇక్కడ నేను, మా నాన్న గారు' గం॥భా॥స॥ అత్తయ్య, బుజ్జాయి కులాసా."

మళ్ళీ నవ్వుకున్నాడు కాముడు.

"ఎంత ప్రేమయితే మాత్రం కోడెదూడ 'బుజ్జాయి'ని కూడా మనుష్యుల్లో కలిపి కులాసా అంటుందేం?... పిచ్చి...." అని.

"మీరక్కడ క్షేమంగా వున్నారని భావిస్తాను. మీరు నాలుగు ఉత్తరాలు రాసినా నేను జవాబివ్వలేదని మీకు కోపం వచ్చిందనుకుంటాను. నన్ను క్షమించండి. కవర్లు తెచ్చిపెట్టే దిక్కులేదు....యీ కవరు మా అమ్మ తెప్పించి పెట్టింది. మన ఎడబాటుకు మీరొక్కరేనా చింతించేది? నాకుమాత్రం బాధగా లేదూ?....చిన్నప్పటినుంచీ ఒక్క ఇంట్లో అంత ఇదిగా పెరిగాం కదా? నా మనసు మీకు తెలియదూ? నాకు మీమీద ప్రేమలేదని రాశారుగదా? మీకు న్యాయమేనా?"....

ఇంతవరకు చదివిన కాముడు మరి చదవలేక చదికిలబడి, దరిమిలా వెల్లకిలబడి తనయొక్క, కల్యాణియొక్క, జాయింటు జీవితాన్ని చిన్నతనం నుంచీ జ్ఞాపకం చేసుకోడం మొదలుపెట్టాడు.

● ● ●

అనగనగా ఓ జగదాంబ కడుపున షుమారు పందొమ్మిదేళ్ళక్రితం ఓ కాయ కాసింది. ఆ కాయపేరు కామేశ్వర్రావ్ ఉరఫ్ కాముడు అనే పండు. దాదాపు రెండేళ్ళ తర్వాత యీ కాయ వళ్ళంతా మన్ను పులుముకుని, బూడిద గుమ్మడిపండు వేషంలో చక్కగా నడుస్తూ, కూచుంటూ, లేస్తూ, పడిపోతూ పాకుతూ, దొర్లుతూ ముద్దు ముద్దు మాటలు కూస్తూ, పెరట్లో మట్టిపెళ్లలూ, బొగ్గులూ భోంచేస్తూవుండగా కాయ తాలూకు మేనమామ పెళ్ళాం కడు

పెండ్యాల నాగాంజనేయులు

పున ఓ నలుసు జన్మించింది. ఆ సమయంలో కాయ తల్లి అక్కడే వుంది. ఉన్న మనిషి వూరోక్కుండా "ఒరేయ్ పండూ! నీకు పిల్లాం పుట్టిందిరా" అంటూ కాయను చంకనేసుకుని, చెంపలు కొరికేసి, సరాసరి తన అన్నగారి దగ్గరకెళ్ళి "అన్నయ్యా! ఇప్పుడే చెప్తున్నాను. నా పండుకూ మీ నలుసుకూ ముడెయ్యాలి తెలిసిందా?" అంది

"అలాగేలే జగదాంబా" అన్నాడు కాయ మేనమామ. నలుసుకు పదకొండోనాడు 'కల్యాణి' అని పేరుపెట్టారు. ఇది జరిగిన కొద్దిరోజుల్లో జగదాంబ ప్రత్యక్షదైవం (పతియే ప్రత్యక్షదైవం) మరో లోకాని కెళ్ళిపోవడంవల్ల, తన పండుతోబాటు ఆమె అన్నగారి పంచనజేరింది

కాముడి కిక్కడే అక్షరాభ్యాసం జరిగింది. మేనమామ చెప్పుచేతుల్లో భయభక్తుల్తో చదువుకునేవాడు.

కాముడికి కల్యాణంటే భలే ఇష్టం. సన్నగా రివటలాగుండేదేమో చంకనేసుకుని పరుగెత్తేవాడు. ఇద్దరూ ఒక్కసారే ఒక్క కంచంలోనే అన్నంతినేవాళ్లు. ఒక్క మంచంలో పడుకునేవాళ్ళు. పెద్దవాళ్ళు "ఒరే కాముడూ నీ పెళ్లామేదిరా" అంటే కల్యాణి ఫొటో చూపించేవాడు. కల్యాణిని "నీ మొగుడేడే" అంటే కాముడి ఫొటో చూపించేది. పెద్దవాళ్ళలా అలవాటుచేశారు.

ఇలా కొన్నాళ్ళు - అంటే కామేశానికి 11 ఏళ్ళు, కల్యాణికి 9 ఏళ్ళు వచ్చాక ఈ 'మొగుడూ పెళ్ళాలు' అనే మాటలు వినబడితే ఇద్దరికీ సిగ్గులాటి కోప మొచ్చి ఉన్న పళాన ఏడ్చేవాళ్ళు "ఛీఛీ" అంటూ. అయినా ఇద్దరూ స్నేహంగానే వుండేవాళ్ళు. ఒకే కంచంలో తింటూ, ఒకే మంచంలో బజ్జుంటూను.

మరో రెండేళ్ళు పోయాక కంచాలూ, మంచాలూ చెరోటి వచ్చాయి. ఎందుకనో! ఎందుకేవిటిలెండి! పెద్దాళ్ళే అలా చేశారు. పైగా చాటునేమోగాని... వాళ్ళ ఎదుట మాత్రం "మొగుడూ పెళ్లాలు" అనే మాటలు వాడ్డం మానేశారు.

ఇది జరిగినా వాళ్ళిద్దర్లో పిసమెత్తు 'ఇష్టం' క్షీణించలేదు. కానీ — కాముడికి 16 ఏళ్ళు దాటుతూండగా - అనగా స్కూలు ఫైనల్ పరీక్షలు జరుగుతూండగా, అతనింకా ఇంట్లోవాళ్ళతో "కుర్రవెధవ, పసివన్నాపి." అని అనిపించుకునే స్థితిలో చటుక్కున ఓరోజున కల్యాణికి 'పెద్దరికం' అంటగట్టేశారు పెద్దాళ్ళు. "ఇదేమిటీ?" అని విస్తుబోయాడు కాముడు. తను కల్యాణి కన్నా రెండేళ్ళు పెద్దగదా? తనకన్నా గభాల్న కల్యాణెలా పెద్దది కాగలిగింది? అదీ పాయింటు.

"హౌ ఈజ్ ఇట్ పాసిబుల్?" అనితనకు తనే ప్రశ్న వేసుకుని "ఇంపాసిబుల్" అని తనకు తనే సమాధానం చెప్పుకుని, ఎందుకైనా మంచిదని వాళ్ళమ్మ నడిగితే —

"ఓరి కుఱ్ఱనాగమ్మా! వెధవ ప్రశ్నలు వెయ్యకు. పరీక్ష ప్యాసయ్యే మార్గం చూస్కో.... నాకొంచెం పనుంది.... నువ్వలా కాసేపు తిరిగిరా" అని పంపించేసింది.

తల్లి మాట వినిపించుకుని పరీక్షలు పూర్తిచేశాడు. అయితే కల్యాణి ఇదివరకటిలా కాముడికి తన మొహం చూపించడంలేదు. పోనీ అతని మొహాన్ని చాటునుంచి చూసినట్టు రుజువులూ లేవు. ముఖవీక్షణమే లేంది మాటలెక్కడ? ఒకటి రెండుసార్లు పలకరిద్దామనుకుంటే పరుగెత్తుకుపోయింది. చాలా రోజులు తపించిపోయాడు కల్యాణి దర్శనార్థం. కాని అదంతా గగన కుసుమమయింది.

'బడాయ్' అనుకున్నాడు. 'గర్వం' అనుకున్నాడు. 'పొగరుమోత్తనం' అనికూడా అనుకున్నాడు. ఊహూఁ! ఇన్నినుకున్నా కనబళ్ళేదు.

ఇలా అనుకుంటూండగా పరీక్ష ఫలితాలొచ్చి "కామేశ్వర్రావుకూడా ప్యాసయ్యాడండోయ్" అని ఆంధ్రదేశం నలుమూలలా గావుకేకలు పెట్టాయి. ఆ రోజు ఇంట్లో వాళ్ళంతా ఎగిరి గంతులేశారు. జగదాంబ వీధిగడపలో కూర్చుని రాత్రి జనసంచారమున్నంతవరకూ పిల్చి మరీ చెప్పింది తన కొడుకు ప్యాసైనట్టు.

కల్యాణి కామేశ్వర్రావు నెంబర్ని కంఠతా పడుతూ కూర్చుంది.

"అన్నయ్యా! మరి వీణ్ణి కాలేజీలో జేర్పిద్దాం" అంది జగదాంబ.

"లేకపోతే ఎలాగమ్మా? సరస్వతీదేవికి తీరని ద్రోహంకూడా చేసినవాళ్ళమవుతాం" అన్నాడు అన్నగారు.

మరో ఇరవై రోజుల్లో కాముడు పి. యు. సి విద్యార్థయ్యాడు పట్నంలో. మేనమామే స్వయంగాచేర్చి, పొడుగులాగూ చొక్కాలు కుట్టించి. రూం ఏర్పాటుచేసి హితబోధ గావించి చక్కావచ్చాడు.

త్వరలోనే కాముడు కాలేజీలైఫ్ అనుభవించడం నేర్చుకున్నాడు. ఎంతసేపూ స్నేహితులు, మేటినీ లేక రెండో ఆట సినిమాలు, సినిమాలపై చర్చలు, ఇదేవిధంగా ఏడాదీ గడిపేసి పరీక్షలు తద్దినం పెట్టినంత శ్రద్ధగానూ తగలేసి పట్నమూ స్నేహితుల కన్నా కల్యాణీ, మామయ్యే బలవంతులని తెల్చుకొని వూరికెళ్ళిపోయాడు.

"ఏరా కామేశం? ఎలా రాశావు పరీక్షలు?" అని నిలబెట్టి అడిగితే "బాగానే రాశాను మామయ్యా" అన్నాడు. కూర్చుంటూ.

నెల తిరక్కుండానే కాయకూ, కల్యాణి అనే నలుసుకూ ముడిపడిపోయింది. (పోనీ మూడు ముళ్ళనుకోండి).

ఎన్నోయుగాలనంతరం (వాళ్ళకేలెండి) మళ్ళీ కాముడూ కల్యాణీ ఒకళ్ళనొకళ్ళు ముట్టుకోగలిగారు నెత్తిమీద బెల్లం జీలకర్ర పెట్టేటప్పుడూ. తాళి కట్టేప్పుడూ హోమగుండం చుట్టూ తిరిగేప్పుడూ, బిందెలో ఉంగరాలు తీసేప్పుడూ, ఒకళ్ళకొకళ్ళు మంచిగంధం రాసుకునేప్పుడూ....

ఒకే వెండికంచంలో భోంచేయగలిగారు. ఒకళ్ళనొకళ్ళు దొంగచూపులు చూసుకుంటూ.

ఈ నవ దంపతుల్ని చూసి కన్నకడుపులు బ్రహ్మానందపడి పోయాయి.

కల్యాణి తల్లి మరి కాస్త ముచ్చటపడి "చాలారోజుల తర్వాత ఒకే కంచంలో భోంచేస్తున్నారు ...మరి ఒకే మంచంలో...." అని భర్త ముందర నసిగితే "ఛ! ఉండవే! ఏమంత తొందర? వాడికేదన్నా ఉద్యోగం దొరకనీ" అన్నాడు భర్త నసుగుతూనే....,

కొద్ది రోజుల్లో పరీక్ష ఫలితాలొచ్చి. కామేశానికి బజార్లోనే కనబడి "ఈసారి నువ్వొక్క పార్టులోనే ప్యాసయ్యావు" అని చెప్పేశాయి. మామయ్య మాటంటే వణికిపోయే కాముడు ఇంటికొచ్చి, ముసుగు తన్ని చంకలో ఉల్లిపాయముక్కలెట్టుకుని, జ్వరం తెప్పించుకొని మూసినకన్ను తెరుస్తూ పడుకున్నాడు - మామయ్యొచ్చి ఏం కేకలేస్తాడోననే భయంతో. మామయ్యొచ్చాడు. మొహంమీద ముసుగు తొలగించాడు. మూసిన కళ్ళను ప్రేమతో తెరిచాడు.... కొయ్యబారి చూస్తున్నాడు కామేశం. "ఏరా కాముడూ, ఇలా అయిందేరా?" అన్నాడు మెత్తగా, నెమ్మదిగా .... "పరీక్షల్లో ఒకటే

జ్వరం మామయ్యా! అసలు పరీక్ష కెళ్ళడమే కష్టమైపోయిందీ" అని లంకణాలు పడ్డవాడిలాగా చెప్పాడు.

జగదాంబ, అత్తగారూ "పోన్లే నాయనా పెధవ పరీక్ష! మళ్ళీచదివి పాస్యవుదుగాన్లే పైయేటికి" అని సముదాయించారు.

కల్యాణిమాత్రం కన్నీళ్ళు పెట్టుకున్నట్టు కనిపెట్టాడు కాముడు. పరుగెత్తి కెళ్ళి ఓదార్చుదామనుకున్నాడుగాని, ఆ పిల్ల దొరికితేనా?

ఇలాకాక్కాదని, తను ఇకమీదట బుద్ధిగా చదువుకుంటాననీ, పరీక్ష ప్యాసవుతాననీ ఒట్టువేస్తూ ఒక చిన్న ఉత్తరమ్ముక్క రాసి కల్యాణి పెట్టెలో పడేశాడు. తను ఆ అమ్మాయితో సర్దాగా మాట్లాడాలనుందనీ, ఆ అమ్మాయినెంతో గాఢంగా ప్రేమిస్తున్నాననీ కూడా రాశాడందులో.

మర్నాడు కాముడు కల్యాణి పెట్టెతెరిచే సరికి అందులో కల్యాణి తనకు రాసిన వుత్తరం వుంది. "అన్నమాట తప్పకుండా చదివి ప్యాసయి నా గౌరవం కాపాడతారని నమ్ముతున్నాను. నాకూ మీతో మాట్లాడాలని వుంది. మిమ్మల్ని చాలాచాలా గాఢంగా నేనూ ప్రేమిస్తున్నాను" అని రాసింది.

వాగ్దాన ప్రకారం - ఒక పక్క చిన్న చిన్న ప్రేమలేఖలు రాస్తూ, కల్యాణి రాగం పాడుకుంటూ మొత్తంమీద సెప్టెంబర్లో మిగతా రెండుపార్టులూ ప్యాసయ్యాడు. రిజల్ట్సు శుభవర్తమానం తెచ్చిన రోజున ఇంటోవాళ్ళంతా నిముషాలమీద ఒళ్ళు చేశారు. ఆ రోజునే కాముడూ, కల్యాణీ పెద్దవాళ్ళెవళ్ళూ దగ్గరగా లేకుండాచూసి కాసేపు మాట్లాడుకున్నారు - చాలా రోజుల తర్వాత.

తరచు ఇలాంటి అవకాశాలు దొరికినప్పుడు ఇలాగే మాట్లాడుకుంటూండే వాళ్ళు.

"ఒరే కాముడూ! ఇహ ఉద్యోగ ప్రయత్నమేదన్నా చెయ్యి" అన్నాడు మామయ్య ఒకరోజున -

"మరి బి. ఏ చదివించవా అన్నయ్యా?" అంది జగదాంబ చతికిలబడుతూ.

"ఇంకెందుకు లేమ్మా! బి ఏ లూ ఎం. ఏ లూనూ. ఇవి పాసయ్యేసరికే వీటికి ఆయాసం, రొప్పు, దడ బయల్దేరాయి. ఆ వుద్యోగం కాస్తా చూసుకుంటే వాణ్ణీ, కల్యాణినీ ఆ కాస్త అడ్డూ తీసేసి పంపించేద్దాం" అన్నాడు మామయ్య.

"అవునమ్మా: ఉద్యోగం పురుష లక్షణం! వెంటనే ప్రయత్నం చేస్తా! నేను బతకడానికి చదువు చాలు. మామయ్య మాట మహా కరెక్టు" అన్నాడు కాముడు.

అంతరార్థగ్రాహి మామగారు చిరునవ్వు నవ్వుకున్నాడు.

గోడచాటునుంచి వింటున్న కల్యాణి మనసు స్వర్గసీమను చూస్తోంది.

ఆనాటినుంచీ రీమ్ములకొద్దీ దరఖాస్తులు పడేశాడు. రోజూ ఓ అణా బలపాలు కొనుక్కొని కాళ్ళకక్కట్టుకొని ఎలక్షను అభ్యర్థి ఓట్లకోసం తిరిగినట్టు తిరిగాడు ఉద్యోగాలకి.

కాముడు పడే అవస్థ ఆర్నెల్లపాటు గమనిస్తూ ఊరుకున్న మామగారు, "ఇహ నీవల్లకాదులేరా సన్నాసీ" అనేసి, తనే అతణ్ణి వెంటబెట్టుకొని, ఓ మంచి రోజున చెన్నాపట్నం తీసుకెళ్ళి ఓ స్నేహితుడి సహాయంతో నూరు రూపాయల గుమాస్తా ఉద్యోగం అయిదొందల రూపాయలకు బేరంచేసి మరీ కొనిపెట్టాడు.

"ఓ ఇరవై రోజుల్లోపలే ఆర్డర్లొస్తాయి. ఆర్డర్లు జారీఅయిన మరుక్షణమే ఉద్యోగంలో ప్రవేశించాలి" అన్నా డాఫీసు మేనేజరు.







మామయ్య చేతులుకట్టుకుని "అలాగేనండి! అయ్!" అన్నాడు

కాముడు తల తాటించాడు తాటికాయలాగా....

ఇంటికొచ్చేశారు మామా అల్లుళ్లూ. ఉద్యోగం దొరికిందని అందరూ సంబరపడ్డారు.

"అమ్మయ్య! నా కాముడి ధర్మమా అని మద్రాసు చూడబోతానుగావల్ను" అంటూ సరదాపడింది జగదాంబ.

ఆ కాస్త "అడ్డు"కోసం పాకులాడిం దత్తగారు.

పదిరోజుల్లో 'ఆ కాస్త అడ్డు'కూ ముహూర్తం పెట్టించడమూ, మంత్రాలతో పీటలమీద తతంగము, భుజంమీదుగా చెయ్యి వేయించడమూ, ఆ తర్వాత దంపతుల్నిద్దర్నీ శోభాయమానంగా అలంకరించబడిన పందిరి మంచంమీద కూచో పెట్టి దంపత్తాంబూలా లిప్పించడమూ - అన్నీ సవ్యంగానే జరిగాయి.

దంపతుల్నిద్దర్నీ గదిలో స్వేచ్ఛగావదిలి తలుపు బయట గొళ్లె పెట్టడం జరిగాక అమ్మలక్కల గుసగుసలూ, సన్నగా నవ్వుకోడమూ బాగానే వినబడ్డాయి వాళ్ళకు.

"సింగినాదం పోదూ!" అనుకున్నాడు కాముడు.

అందరిలాగే అతనూ తనకది మరపురాని మధురక్షణం కాబోతుందని దుంఖిప్రాయపడ్డాడు పాపం కల్యాణికూడా అలాగే పడింది. ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నారు. ఇంతలో గది తలుపులు దబాదబా బాదటం, దంపతులిద్దరూ కంగారుపడిపోవటం, "కాముడూ!" అని మామయ్య కేక వినబడ్డంకూడా జరిగింది.

కాముడు బెరుకు బెరుగ్గా వచ్చి తలుపు తెరిచాడు. మామయ్య చేతిలో టెల్గ్రిగాంతో నిలబడున్నాడు

"ఒరే కాముడూ! వెంటనే బయల్దేరు. ఉద్యోగం ఆర్డర్లొచ్చేశాయి. మద్రాసు మెయిలుకు టైంకూడా ఎంతో లేదు" అంటూ తొందరపెట్టేశాడు

'బ్యార్'మని ఏడ్వబోయాడు కాముడు.

"రేపెడతానులే అన్నయ్యా!" అంటూ బ్రతిమాలింది జగదాంబ.

"పిల్లేమ మళ్ళీ రెండురోజుల్దాకామంచిది కాదు. ఇప్పుడే వెళ్లాలి. ఐదొందలు పోసి కొన్న ఉద్యోగంకూడా" అన్నాడు మామయ్య కర్కశంగా.

"పర్వాలేదండి! రేప్రొద్దున్నే ..." అంటూ వచ్చిం దత్తయ్య.

"నోర్మూయ్!" అన్నాడు మామయ్య.

జగదాంబకూడా కాముడివెంట వెళ్దామనుకుంది గాని, "కల్యాణిని కాపురానికి పంపేటప్పుడు వెళ్దువుగాన్లే"అన్నాడు మామయ్య.

వెంటనే మెయిల్లో మద్రాసొచ్చేసి ఉద్యోగంలో చేరిపోయాడు కామేశం నెలరోజులు పూర్తిగాకుండానే కల్యాణిమీద భ్రమకల్గి సెలవడిగితే "ఇవ్వడానికి వీల్లేదు" అన్నాడు ఆఫీసు మేనేజర్.

కొన్నాళ్ళు జరిగాక కల్యాణిద్వారా అత్తయ్యకు బ్లడ్ప్రెషర్ వచ్చిందనితెలుసుకొని, ఈవంకతో ఊరెళ్లాలని మళ్ళీ సెలవుకోసం దేబిరిస్తే "ఆర్నెల్లుసర్వీసన్నా పూర్తి కాకుండా సెలవడిగితే చావబాత్తాను" అని కేకలేశాడు మేనేజర్.

విరహగీతాలు పాడుకుంటూ ఏడ్చేశాడు కాముడు.

ఇక ధైర్యంచేసి, కల్యాణి కాపురానికి పంపించే విషయం ఆలోచించవలసిందిగా

మామయ్యకు, జగదాంబకు, కల్యాణికీకూడా ఉత్తరాలు కురిపించడం మొదలెట్టాడు.

ఇదిగో అదుగో అంటూ మూణ్ణెల్లు జరిగాక, జగదాంబదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. "ఫలానా రోజున కల్యాణిని కాపురానికి తీసుకుని వస్తున్నాను" అని.

కల్యాణితోబాటు తన తల్లికూడా వస్తుందని విన్న కాముడు కొంచెం బాధపడ్డాడు. అందుకని—

"అమ్మా! నువ్వు రాసిన వుత్తరం అందింది. నువ్వుకూడా కల్యాణితోబాటు రావడం నాకు చాలా యిష్టమేగానీ, ఇక్కడ నీ మడికీ, ఆచారాలకూ మహా ఇబ్బందిపడిపోతావేమోనని మహా బెంగపడిపోతున్నాను. ఇక్కడ రాముడువారి పళ్ళాలు దొరకవు. దొరికినా దీపారాధన చేసుకునేందుకు వత్తులుగానీ, పత్తిగానీ అసలే దొరకవు. పైగా నువ్వు శనివారప్పిండీ, ఏకాదశిపిండీ విసురుకోడానికి తిరుగళ్ళు బొత్తిగా లేవు. కాబట్టి ఇవన్నీ సమకూరిన తర్వాత తప్పకుండా వద్దువుగాన్లే" అని తిరుగుటపాలో ఉత్తరం రాశాడు తల్లికి.

కాపురం పెట్టడానికి అతని స్తోమతకు ఒక్కటే గది దొరికింది పదిహేనురూపాయలకి. మరి తనూ కల్యాణీకాక మూడో మనిషుంటే ఏం బాగుంటుంది చెప్పండి. అంతే కారణం. ఇంకేం లేదు.

ఆ వుత్తరానికి తిరుగుటపాలో జవాబొచ్చింది.

"మడీ ఆచారాలు, అన్నీ సరిపెట్టుకుంటాను" అని రాసింది జగదాంబ.

భలే మండిపోయింది కాముడికి.

"ప్రియమైన తల్లిగారూ, మీరు కనుక ఇక్కడికొస్తే అక్కడ మామయ్యా, అత్తయ్యా బెంబేలు పడిపోతారు. అసలే అత్తయ్యకు బ్లడ్ ప్రెషర్‌కూడా నాయె. మీరు మామయ్యకు తోడుగావుండి అత్తయ్యనీ ఇంటినీ వెయ్యి కళ్ళతో కాపాడవలసింది. వాళ్ళు మనకింత సాయం చెయ్యగా మీరా మాత్రం త్యాగం చెయ్యలేరా! నన్ను ఇవాళ కాకపోతే రేపు చూస్తారు. నేనెక్కడికి పోతాను. మీరెక్కడికి పోతారు." అంటూ మళ్ళీ జవాబు రాశాడు.

దానికి మళ్ళీ సమాధానం రాలేదు.

ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాంమాత్రం వచ్చింది. 'కల్యాణి మెయిల్లో వస్తోంది స్టేషన్లో దింపుకోవలసిందీ' అని

● ● ●

కాసేపు ఉత్తరాలన్నీ చదివేసి వీధిలో పడ్డాడు. అప్పటికే టైం ఏడుగంటలైంది.

నెమ్మదిగా కల్యాణిరాగం ఆలపించుకుంటూ అలా బజార్లో నడవడం మొదలుపెట్టాడు. "ఏమోయ్! కామేశం!" అని తన వెనకాలనుంచి వినబడింది. తిరిగి చూశాడు. వాళ్ళ హెడ్‌గుమాస్తా! సతీసమేతుడై. చేతిలో ఒక గుడ్డల ప్యాకెట్‌తో తనని సమీపిస్తున్నాడు.


"నమస్కారం సార్!" అన్నాడు కాముడు.

"అలా చెప్పకుండా చెయ్యకుండా ఆఫీసునుంచి వచ్చేశావేమోయ్! పైగా మధ్యాన్నం రిజిస్టర్డ్ పోస్టులో వచ్చిన కాగితానికి వెంటనే జవాబిమ్మని చెప్పాను గదా.... అది పుటప్ చెయ్యకుండా పారిపోయొచ్చావ్ ఏమిటి నీ వుద్దేశం?" జాడించి పారేస్తున్నాడు హెడ్‌గుమాస్తా.

"అదికాదు సార్.... నా వైఫూ...." లాగుతున్నాడు కాముడు.

"ఏమిటోయ్? వైఫు? నాకు లేదేమిటి వైఫు!" మరింత దబాయిస్తున్నాడు హెడ్‌గుమాస్తా తన భార్యవంక చూస్తూ.






"కాదండీ.... రేపు మెయిల్లో...." మళ్ళీ కాముడు.

"ఆఁ! ఇవాళ మెయిల్లో వచ్చిన కాగితాన్నింత గొప్పగా తగలెట్టావు.... ఇహ రేపు మెయిల్లో వచ్చేవాటిని నిర్వాకంచేస్తావ్, నీ మూలంగా మేనేజర్ తిట్లు నాకు తగిలాయి."

"సారీ సార్; రేపు వుదయం"

"ఆఁ! ఇకా రేపొద్దునదాకా మురగబెడ్తా ఆ కాగితాన్ని! నేనే తగలేశాలే! ఇంకెపుడూ ఇలాటి పన్లు చెయ్యకు" వార్నింగ్ ఇస్తున్నాడు గుమాస్తా.

"లేదు సార్! చెయ్యనుసార్? ఎక్స్క్యూజ్ మీ! నాసంగతి చెప్పనీండిసార్! నన్ను మాట్లాడనీండిసార్" ప్రాధేయపడ్డాడు కాముడు.

"సరే; ఏమిటో మాట్లాడునాయనా!" విసుక్కున్నాడు గుమాస్తా.

"రేపు మార్నింగ్. చీకటితో నాభార్య.... అదే నా వైఫ్ వస్తోంది మెయిల్లో"

"ఆఁహా! అయిందీ! రేపటినుంచీ సముద్రంలో దిగబోతున్నావన్నమాట!" అంటూ జోకేసి నెమ్మదిగా పెళ్ళాంవంక తిరిగాడు నవ్వుతూ.

ఆవిడ వ్పటికే కళ్ళు రెండూ ఎరుపు రంగుకు మార్చేసింది.

"వస్తానోయ్!" అంటూ వెళ్ళిపోయాడు హెడ్‌గుమాస్తా, సతీసమేతుడై.

బిక్కమొహం పెట్టాడు కామేశం. కాసేపటికి తేరుకుని "మీ మొహం! పొండి సార్!" అనుకున్నాడు!

ఆ రాత్రి గడియారం దారుణమైన నెమ్మదిగా తిరిగి తిరిగి నాలుగు గంటలు చూపించింది.

ఝామ్మంటూ అయిదు గంటలకల్లా స్టేషన్‌లో కాలెట్టాడు కాముడు.

ఎదురుగుండా బోర్డుమీద "హౌరా మద్రాస్ మెయిల్ 101 నిముషాలు లేటు" చూసి "చచ్చాం" అనుకున్నాడు "గోవిందా" అనుకున్నాడు. "నా ఖర్మ" అని నుదుటి మీద కొట్టుకున్నాడు.

తలకిందులుగా నుంచుని చూశాడు. అయినా 101 మారలేదు.

ఇన్ని డైలాగులు చెప్పి, ఇంత ఏక్షను చేసినా రైల్వేవాళ్ళెవళ్ళూ బోర్డు మీద రాసింది సరిదిద్దలేదు. ఈ రాతని గురించి ఎంక్వయిరీలో కనుక్కున్నా వాళ్ళు తమది పొరపాటనీ అనలేదు. క్షమించమని అడగనూలేదు. తన ఇష్టదైవాన్ని కాసేపు తిట్టుకుని, అలసిపోయి, కాఫీతాగి, సిగరెట్లు పీల్చి, తాంబూలం వేసుకొని, స్టేషన్ ప్లాను తాపీగా పరీక్షించి మెయిలిక ఐదు నిముషాల్లో వస్తుందని మైక్ ద్వారా విని మైక్ లో చెప్పినవాడి కంఠం అచ్చు రఫీ కంఠమేననుకుంటూ తన ఇష్టదైవాన్ని స్తుతించి, కళ్యాణిరాగం ఆలాపిస్తూ ప్లాటు ఫారంమీదకు పరుగెత్తాడు.

మెయిలొచ్చి ఆగింది. ఇంజన్ దగ్గర్నుంచే కళ్యాణికోసం వెదకడం మొదలు పెట్టాడు. అయిదుపెట్టెలు దాటాక "అదిగో కళ్యాణి!" అనుకుంటూ పరుగెత్తి అటు తిరిగివున్న "కళ్యాణిపై" చెయ్యేశాడు.

"కళ్యాణి" తలకాయ యిటు తిరిగింది. కాముడి తలకాయ గిరగిరా తిరిగింది. దేహం మార్గశిర మాసంలో తెల్లారుఝూమున బావి దగ్గర స్నానం చేసినట్లు వణికింది.

"సారీ, యు అర్ మై వైఫ్ ...ఐ తాట్" అంటూ పరుగెత్తుకుంటూ పోయగా ఆ అమ్మాయి బిత్తరపోయి చూస్తోంది.

జరిగిన పొరపాటుకు పెద్దపెద్ద తిట్లు తిట్టుకుని, మరోసారలా జరక్కుండా జాగ్రత్తగా ముఖాల్ని పరిశీలిస్తూ మొత్తం మీద కళ్యాణిని గుర్తుపట్టాడు - బ్రహ్మానంద పడ్డాడు కాముడు. అప్పుడే చిన్న 'కల' వస్తానని మారాం చేసింది.

"ఇదేమిటి? నాన్సెన్స్. ఇంతమంది జనం వుండగా నువ్వు రావడమేమిటి? బుద్ధి లేదూ నీకు?" అంటూ కసురుకున్నాడు.

'కల' చిన్నబుచ్చుకుంది.

"సర్లే! ఏడవకు! సాయంత్రం మా ఇంటికిరా; నేనూ కళ్యాణీ నీకోసం కాచుకు నుంటాం! మర్చిపోకుమళ్ళీ" అంటూ కలకు ధైర్యం చెప్పాడు. 'కల' వెళ్ళిపోయింది.

కళ్యాణినీ, పెట్టెనీ, సామాన్ల సంచినీ, తాటాకు బుట్టనీ గబగబా దింపేసి, పోర్టర్లని పిల్చి వాళ్ళ నెత్తినెక్కించి తనూ కళ్యాణీ బయల్దేరుతూండగా అంతవరకూ కళ్యాణి వెనక మూగగా నిలబడివున్నమ్మాయి వాళ్ళ వెంటపడడమే కాకుండా, తన చేతిసంచీ కూడా పోర్టరుచేతి కిచ్చి, "ఎంత దూరముంటుందక్కయ్యా మనిల్లు?" అంది కళ్యాణితో.

"నాకు మాత్రమేం తెలుసు!" అంది కళ్యాణి.

మతిపోయిన కాముడు "ఈ పాపెవరూ?" అన్నాడు.

"అదేమిటండీ! పదిహేనేళ్ళ అమ్మాయిని పట్టుకొని 'పాప' అంటారు?

"మనూళ్ళో సూరిపంతులుగారని తెలుగు మాస్టారొచ్చారు కొత్తగా. వాళ్ళమ్మాయి. వీళ్ళ అన్నగారు ఈ వూళ్లో వుంటున్నారట పదినెల్లనుంచీ వాళ్ళింటికెళ్ళాలని సర్దాపడి అప్పటికప్పుడు బయల్దేరి నా వెంట వచ్చింది. అడ్రసూ అదీ వుందిలెండి. సాయంత్రం అక్కడికి పంపించాలి మీరు" అంది కళ్యాణి. "సాయంత్రందాకా ఎందుకూ? ఇప్పుడే పంపించేద్దాం. పాపం వాళ్ళన్నయ్యను చూడాలని ఎంత ఇదైపోతోందో! ఏమ్మా!" అంటూ ఆ అమ్మాయివంక చూశాడు.

ఆపిల్లకేం మాట్లాడో తెలియలేదుగాబోలు. కళ్యాణివంక చూసింది. కళ్యాణే అందుకుంది. "కాదులెండి! కాస్త మనిల్లుకూడా చూసి, యీపూట మనింట్లో భోంచేస్తుంది. చల్లబడ్డాక వాళ్ళన్నయ్యగారింటికి...."

"ఆ! ఈరోజుల్లో ప్రత్యేకం చల్లబడ్డం ఏమిట్లే! వర్షాకాలం కూడాను. అదికాదు నా పాయింటు. సాయంత్రం వర్షం వస్తుందో ఏమిటో ..." అంటూ తలగోక్కున్నాడు కాముడు.

"అంతకీవర్షమొస్తే మనింట్లోనేవుంటుంది తగ్గాక వెళ్ళిపోతుంది. ఏమిటి దానికి పెద్ద గొడవ చేస్తారు?" అంది కళ్యాణి.

తాడెత్తున కోపమొచ్చింది కాముడికి ఎవరిమీద? ఆ పిల్లమీద! అక్కడికక్కడే బుగ్గలు వాయగొడదామనుకున్నాడు కాని తగ్గాడు మళ్ళీ. తగ్గి—"నీ పేరేమిటి తల్లీ" అని కరిచినట్టడిగాడు.

ఆ పిల్ల సమాధానం చెప్పలా.

"కుముదమండీ" అంది కళ్యాణి

"ఏమిటీ! అముదమా!" అన్నాడు కసిగా.

కుముదం ఫక్కున నవ్వింది. కాముడికి చెవుడనుకుందో .... లేక పతి పిచ్చివాడనుకుందో!

టాక్సీలో ముగ్గురూ ఇంటికి చేరారు.

"ఈ అముదాన్ని వదిలించుకోవడమెలా?" అనే సమస్యను శతవిధాల పరిష్కరించబోయి, ఎటూ తేలక ఏద్వబోయి, మానేసి, కాఫీతాగి, జ్వరమొచ్చిందనీ, రెండు రోజులు సెలవు కావాలనీ సెలవుచీటీ రాసి మరో గుమాస్తాద్వారా పంపించి, ఇంటికొచ్చి అముదాన్ని చూసి అసహ్యించుకుంటూ పడుకున్నాడు. ఆ రోజు మ్యాటినీకెళ్ళాలనీ, సాయంత్రం వుడ్ లాండ్సులో తనూ కళ్యాణీ కలసి భోంచెయ్యాలనీ, ఆ తర్వాత ఇంటికొచ్చి కళ్యాణితో కబుర్లు చెప్పాలని కలలుకంటే "ఏమిటీ కర్మ? కళ్యాణికూడా ఆ కుముదాన్నే పూసుకు తిరుగుతుందే" అనుకున్నాడు.

కళ్యాణి వంటచేసి కాముణ్ణి ఆహ్వానించింది. ముగ్గురూ ఒకేసారి భోజనానికి కూచున్నారు.

మొత్తంమీద సాయంత్రం మూడుగంటలైంది.

"కల్యాణీ! టాక్సీతీసుకురానా?" అన్నాడు హుషారుగా.

"ఉండండీ తొందరపడతారేమిటి? కుముదం ఫస్టుక్లాసుగా పాడుతుంది. కాసేపు విందాం! మీరూ కూర్చోండి పాడవే కుముదం" అని కుముదాన్ని ప్రోత్సహిస్తోంది.

చప్పబడ్డాడు కాముడు. కాసేపట్లో తేరుకుని —

"మరిత్వరగా పాడెయ్యమ్మా అముదం! మీ అన్నయ్య దగ్గరకి చిన్న కార్లో తీసికెళ్తా! ఊ! అర్జెంట్! ఒకే ఒక్కపాట చాలు!" అంటూ కూర్చున్నాడు.

కుముదం పాట మొదలెట్టి, వరసగా రెండు సినిమాల్లో పాటలు పూర్తిగా పాడింది.

జోరున వర్షమొచ్చింది ఉరుములు మెరుపులతో.

"మీ మాటే ఖాయమైందండీ!" అంది కల్యాణి నవ్వుతూ

"నీ మాటా ఖాయ మైనట్లేగా" అన్నాడు కాము దేడుస్తూ.

సాయంత్రం ఆరు గంటలయినా వర్షం పూర్తిగా తగ్గలేదు 'టీ'కాచింది కల్యాణి. 'వద్దు మొర్రో' అంటున్నా కుముదంచేత కూడా తాగించింది తత్ఫలితంగా కుముదం తెల్లవార్లూ మేలుక్కూచుంది

కాముడూ, కల్యాణికూడా ఆ అమ్మాయితో బాటే అయ్యారు.

సూర్యోదయం అయ్యే సరికి టాక్సీ తెచ్చాడు కాముడు కుముదాన్ని తీసుకుని వాళ్ళన్నగారింటి కెళ్తే ఆ యిల్లు తాళం వేసుంది. పక్కవాళ్ళను కనుక్కుంటే "నిన్న మధ్యాన్నం 12 గంటలకు బయల్దేరి తిరుపతెళ్ళారు; ఇవాళ మొక్కుబళ్ళు తీర్చుకుని, రేపంతా కొండమీదే వుండి, ఎల్లుండి పొద్దున్నే వస్తారు" అని చెప్పారు.

కుముదాన్ని తిట్టుకుంటూ మళ్ళీ ఇంటికి చేరాడు.

ఈసారి కల్యాణిమీదే కోపం వచ్చేసింది.

సెలవు దినాలు కాసినీ వృధా అయిపోయాయి కాముడికి. సోమవారం వచ్చింది. పొద్దున్నే కుముదాన్ని వాళ్ళన్న గారింటికి రవాణాచేశాడు. వాళ్ళూ అప్పుడే వచ్చారట! పరస్పర పరిచయాలు వగైరాల అనంతరం కాముడికి కాఫీ టిఫిన్లు ముట్టాయి. "అప్పుడప్పుడూ వస్తూండండి" అన్నారు వాళ్ళు.

"అలాగే" అని బయటపడ్డాడు కాముడు

దార్లో మరో తన ఆఫీసు గుమాస్తా ఇంటికెళ్ళి "జ్వరం ఇంకా తగ్గలేదు! మరో రెండ్రోజులు సెలవిప్పించండి" అని సెలవు చీటీ రాసిచ్చి. తన వైఫ్ వచ్చిన సమాచారం. కొత్తకాపురం సమాచారం చాలా సర్దాగా ఆ గుమాస్తాకు చెప్పేసరికి "మరో రెండ్రోజులుకూడా సెలవుపెట్టండి కామేశ్వరరావుగారూ" అంటూ బతిమాలాడు గుమాస్తా. "పోన్లే. ఇంత బతిమాలుతున్నప్పుడు మనం కాదంటే ఏం బాగుంటుంద"ని మరో చీటీ రాసిచ్చి "థ్యాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడు కాముడు.

తన ఇంట్లో కాలుపెట్టిన కాముడు 'శవ'మని కొయ్యబారిపోయాడు.

"ఇదేమిట్రా నాన్నా ఇలా చిక్కిపోయావ్! బిడ్డకు సరైన తిండికూడా లేదుగావును! నీ కిష్టమని కొత్తావకాయకూడా తీసుకొచ్చాన్రా నాన్నా! వెధవది.... ఏమిటో మొన్న కల్యాణితో పంపిద్దామనుకుంటూనే మర్చిపోయాను. త్వరగాస్నానం చేసి రా నాన్నా; అన్నం వండిపెడతాను" అంటూ కాముణ్ణి ప్రేమతో నిమిరింది జగదాంబ.

"ఎప్పుడో! ఇంకెప్పుడో" అంటూ ఏడుపుమొఖం పెట్టాడు.


"ఇప్పుడే పెట్టేస్తానురా తండ్రీ! ఒక్క నిమిషం: ఇంక నీకేం భయంలేదు. శుభ్రమైన తిండి తిందువుగాని. అత్తయ్యక్కూడా కాస్త కులాసాగానే వుందా?....ఇంకిప్పట్లో నేనక్కడకి వెళ్ళనే వెళ్ళను. నీదగ్గరే ఉంటా! ఏడ్వకు! వచ్చేసన్నా"ని" అంటోంది జగదాంబ. చదికిలబడ్డాడు కామేశం — "లాభంలేదు! రెండు గదులున్న ఇల్లు చూడాల్సిందే" అని గొణుగుతూ. తలొంచుకుని నవ్వుకుంటూ బియ్యం ఏరుకుంటోంది కల్యాణి.

□□□










పంచాంగం పేజీలు తిరగవేస్తూ అప్పుడప్పుడు ఆత్రంగా లోనికిచూస్తున్నాడుజగన్నాథం.

"మామయ్యా...."

అంటూ వస్తున్న జ్యోతిని చూసి.

"ఏవమ్మా పురుడు వచ్చిందా" అని ఆత్రంగా అడిగాడు జగన్నాథం.

మామయ్య కంగారు చూసి మనస్సులోనే నవ్వుకుంది జ్యోతి.

తనకు తెలుసు. ఈ ఆత్రుత అంతా దేనికో! మగపిల్లవాడు కలిగాడేమో అని. ఇప్పుడు అసలు విషయం చెబితే?

మామయ్య గుండె ఆగిపోదూ?

"మగపిల్లవాడు కలిగాడు మామయ్యా" అంది నవ్వుతూ. ఆవార్త తనెందుకు చెప్పాలి అనుకుంది జ్యోతి.

"నక్షత్రం చాలా మంచిదమ్మా" అనుకుని మురిసిపోతున్నాడు జగన్నాథం.